
నూరేళ్ళ తెలుగు కథకు
నవ్య నీరాజనం - 78



# ‘మహర్షి కానివాడు కథలు రాయలేడు’

**- వీరాజీ**

వాస్తవికతను, సామాజిక స్పృహనూ సమపాళ్లలో రంగరిస్తూ కథని నడిపించడంలో ఆయనకు ఆయనే సాటి. కుటుంబం అంతా కలిసి చదువదగిన కథలు అల్లడంలో అందవేసిన చెయ్యి. సాహితీ ప్రపంచంలో గత అయిదు దశాబ్దాలుగా అలసిపోని వ్యక్తి. ఆయనే వీరాజీ. వారితో ఇంటర్వ్యూ ఈవారం.



ఎన్.టి.ఆర్.తో 'ముఖాముఖి' (1964)

## బాల్యంలో కవిత్వం రాశాను

జీవితంలో అక్షరయజ్ఞం చేస్తూ డెబ్బయి మెట్లెక్కి వచ్చిన నాకు వెనుదిరిగి చూస్తే అరవైదాకా అక్షర సోపానాలే కనబడుతున్నాయ్! అందరికీ రెండు కళ్లు, రెండు చేతులు, రెండు చెవులు యిచ్చినట్లు దేవుడు నాకు సాహిత్యం-జర్నలిజమ్ వరాలు రెండు అదనంగా యిచ్చాడు.

'కథ' రాస్తే అది చెప్తున్నట్లుండాలి. కథ చెప్పడమే మంచిది. అయితే ఎటువంటి కథలు చెప్పాలంటే ఇతివృత్తంలో వాస్తవికత వుండి, దేశ కాలమాన పరిస్థితులకు అనుగుణంగా వున్న సంఘ జీవనం గల కథలే చెప్పాలి. మనో మాలిన్య ప్రక్షాళన చేయడమో, లేకపోతే ఆరోగ్యకరమైన మానసోల్లాసాన్ని కలిగించడమో చేయగలగాలి.

పది పన్నెండేళ్ల ప్రాయంలోనే నేను మొదట 'కవిత్వం' రాశాను. ఆనక కథలు రాశాను. పిల్లవాణ్ని కనుక పిల్లల కోసమే రాశాను. బాల అన్నయ్య, బాల అక్కయ్య (న్యాపతి రాఘవరావు దంపతులు) నాలాంటి ఎందరికో 'బాలశిక్ష' అయిన 'బాల'నీ మర్చిపోలేను. నేను స్వేచ్ఛగా 'జల పాతం గురువెవ్వరు? సుడిగాలికి బడి ఎక్కడ? కోకిల గాత్రం సాధన చేసేదెన్నడు?' అంటూ రాశాను.

1950 నాటి 'ఢంకా' పత్రికలో నా పేరుపడ్డది. బాలపత్రికలో 'బాలిండియా రేడియో' అంటూ వ్యంగ్య వార్తలు 'బాల'లో ''చదువుతున్నది పిళ్లా వీరవెంకట సూర్య అప్పల కృష్ణమూర్తి'' అన్నది నేనే! 'పాపాయి' పత్రికలో 'మహాబలుని ద్వీపాంతర సాహసయాత్రలు' సీరియల్ కథ రాసింది నేనే! స్వామీజీ అంటే వివేకానంద బొమ్మ అంటించిన నోట్‌బుక్కూ నేతాజీ అంటే సుభాష్‌చంద్రబోస్ బుష్ కోటూ నా ట్రేడ్ మార్కులు. మా ఫ్రెండ్స్ నన్ను ''వోరేయ్! పిళ్లాజీ'' అనే వాళ్లు. అప్పట్లో యింటిపేర్లతో పిల్చుకోడమే ఫేషన్. ''వొరేయ్ పుచ్చా!'' అంటే, ''వొరే కాకర్లా!'' వొరే, రాంభొట్లా!'' అట్లా... నా పూర్తి పేరులోని పేర్లన్నీ - కృష్ణశ్రీ, వీరక్రిష్ణ, కృష్ణానంద్. వీరానంద్...అన్నీ కలం పేర్లుగా మారి, మారి నేను ఎనిమిదో తరగతికొచ్చే సరికి 'వీరాజీ' గా సెటిల్ అయిపోయింది. 1968లో ఆంధ్రపత్రిక జనరల్ మేనేజర్ కుంచితపాదం గారు 'గెజట్'లో వేయించాక నా అసలు పేరే రికార్డులో 'వీరాజీ' అయిపోయింది. కలం, గళం ఒకటైనాయి.

## ఆది గురువులు నాయనమ్మ, కక్కి

మా నాయనమ్మ - పిళ్లా సుబ్బమ్మ, ఆనక మా పినతండ్రి భార్య పార్వతి కక్కి (పిన్ని) ఈ యిద్దరే నాకు ఆదిగురువులు. మా 'కక్కి'కి రాని కథలేదు. చారుదర్వేష్ కథలు, కాశీమజిలీ కథలు, బేతాళ కథలు, చిలక చెప్పిన కథలు...వోహ్! ఇవన్నీ హావభావ విన్యాసాలతో 'కళ్లకు కట్టినట్లు' చెప్పేది.

ఎనిమిదో క్లాసులో నేను 'బాలమిత్ర' అని, ఓ లిఖిత పత్రిక, దానికి అనుబంధంగా 'మిత్రా లయిబ్రరీ' పెట్టేన ఫ్రెండ్స్‌తో కలిసి! బెజవాడలో యిప్పటికీ 'గాంధీజీ మున్సిపల్ హైస్కూలు' అనే రాతి కట్టడమే బ్రహ్మాండమయిన 'కోట' లాంటి కట్టడమని నా నమ్మకం. అక్కడ చదువుకుంటూనే నేను పిల్లల కోసం రాస్తూనే పెద్దాణ్ణయ్యాను అంటే పెద్దల రచయితనయ్యాను. పద మూడో ఏట 1953లో 'పాప దొరికింది' అన్న సాంఘిక కథ రాశాను.

మా హైస్కూల్ ఎటెండర్ పోలయ్య చనిపోయినప్పుడు మేమంతా చలించి పోయాం. గానీ, మా హెచ్.ఎం. నాయుడుగారు శెలవు 'యివ్వను' పొమ్మన్నాడు. సంతాప సభపెడితే రాను 'పొమ్మ'న్నాడు కోపమొచ్చింది నా (మా)కు. ఘాటుగా నా పత్రికలో ఎడిటోరియల్ రాశాను. అదే నా తొలి సంపాదకీయం. అప్పటికీ ఖాసా సుబ్బారావు గారి 'తెలుగు స్వతంత్ర' 'స్రవంతి'లాంటి పత్రికలకి కవితలు రాస్తున్నాను. కానీ, మా హెచ్.ఎం. నన్ను ఏ మాత్రం 'కేర్' చెయ్యకుండా కేకేశాడు. ''ఎట్లారాశావబ్బాయ్? ఇదీ'' అన్నాడు. బెత్తాం ఝుళిపిస్తూ. బుష్‌కోటు జేబులోంచి పెన్ను తీశాను. ''ఇట్లా సార్!'' అన్నాను. టక్కున ఆ కలం లాక్కున్నాడు. అది మానాన్నగారు నాకు బహుమతిగా యిచ్చిన పార్కర్‌పెన్! (చాలా కాస్ట్లీ) 'జాన్‌దేవ్!' అనుకున్నాను.

మా నాన్నగారు పిళ్లా విశ్వనాథం పంతులు. బాపినీడు గారి 'ఆంధ్ర సర్వస్వం' తెచ్చిచ్చారు చదవమని. ఇంగ్లీషు పుస్తకాలు చదవడం నేర్పించారు. మా అమ్మ (వేంకటరత్నం) నాన్నగారూ మాకు యిచ్చినంత స్వతంత్ర్యం, స్వేచ్ఛ నేను/మా/పిల్లలకివ్వలేక పోయానేమో!

ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం సాగే రోజుల్లో మా స్కూలు ఎదుట గాంధీ పార్కుకి ప్రకాశం పంతులు గారు వచ్చి ఉపన్యాసాలిచ్చేవారు. మేము శ్రద్ధాభక్తులతో వినే వాళ్లం. ఆంధ్ర రాష్ట్రం అయితే వచ్చిందిగానీ 'మద్రాసురాలా' (మనకు) పోనీ, 'బెజవాడ రాజధాని అయిందా? అదీ లేదు' దాంతో, నా 'కలం' నిప్పులు కక్కింది.'షూటింగ్'' మొదలెట్టాను. నా పత్రికలో. అదే నా మొదటి 'కాలమ్' సరే! తర్వాత ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ కళాశాల, అటు తర్వాత ఆంధ్రా యూనివర్సిటీలో ఫిజిక్సు ఆనర్స్ చదువు సాగుతూండగానే క్రికెట్, చదరంగం ఆడుతూనే రచయితగా బాగా ఎదిగాను. కవితలు, కథలు నవలలు రాయడం ఓ దినచర్య అయింది.మా తాత పిళ్లా సుబ్బారాయుడుది విజయనగరం. నేను అక్కడే పుట్టినా మా నాన్నగారి ఉద్యోగరీత్యా బెజవాడలోనే నా అన్నప్రాశన, అక్షరాభ్యాసం గట్రా జరిగాయి. కనుక, నా నేటివ్‌ప్లేస్ విజయవాడే!

## కథా 'కదన' రంగం

అదే ఇక్కడ అసలు విషయం. కథా శతజయంతి ఉత్సవాల సందర్భంగా వీరాజీ కథల మీద మాట్లాడటం కనుక ఆ 'ప్లాట్‌ఫామ్' ('ప్లాట్‌ఫామ్' కథ 1958) మీదకే పోదాం. 'వేదగిరి కమ్యూనికేషన్స్ సారథి' రాంబాబు పూనికతో గురజాడ వారి 'దిద్దుబాటు' ఆవిర్భవించిన విజయ నగరంలో 2009 ఫిబ్రవరి 7, 8 తేదీలలో కథా శత జయంతి వేడుకలు బ్రహ్మాండంగా ప్రారంభమయ్యాయి. నాటి సభలను లాంఛనంగా 'జ్యోతి' వెలిగించి ప్రారంభించే సదవకాశం నాకుదొరికింది. అదే మధ్యాహ్నం అదే వేదికమీద 'తెలుగు కథానికా డాట్ కామ్' అనే ప్రప్రథమ కథల వెబ్‌సైట్‌ను కూడా నేనే ఆవిష్కరించాను.

నేను పుట్టిన వూరూ, తెలుగు కథ జన్మించిన వూరూ ఒకటే కావటంతో నా ఒడలు పులకరించింది. అంతలో ఒక నవరచయిత వచ్చి 'మీ 'మునగచెట్టు' కథ నాకు బాగా జ్ఞాపకం వుంది' అంటూ పల్కరించే సరికి, నేను చకితుణ్నయ్యాను. ఎప్పటి మునగచెట్టు?! (1958). దానికి ముందు నా 'ప్లాట్‌ఫామ్' కథ (1958) ఎందరో విజ్ఞులనీ, విమర్శకుల్నీ కదిలించింది. మేము మా బాల్యం అంతా గడిపింది. బెజవాడలో వించిపేట. అది ఫక్తు ముస్లిం ఏరియా. సాయిబుల యింట్లో గోరింట, మునగచెట్లు వుండీ తీరుతాయి. ఎన్నాళ్లో నా మనసులో చిలవలు పలవలుగా పెరిగిన మునగచెట్టును కథకు ఎక్కించాకా అది 'వీక్లీ'లో తక్షణం అచ్చయింది. ఆ రోజులు నిజంగా తెలుగు కథానికకి స్వర్ణయుగం. కథ వీక్లీలో వస్తే మర్నాటికి అది 'టాక్' అందుకునేది. రచయిత చాలా రోజులు కాలరెత్తుకు తిరగటమో లేదా చీవాట్లు తిని, కుక్కిన పేనులా, మరో కథకి సన్నాహం చేసుకోడమో చేయాల్సి వచ్చేది.

## 1960 మరపురానిది

ఆంధ్రా యూనివర్సిటీ క్యాంపస్ నుంచి నేను తిరిగి వస్తూంటే మహీధర రామ్మోహనరావుగారింట జరిగే వారాంతపు సాహిత్య గోష్ఠికి లాక్కు పోయాడు మా తమ్ముడు సుబ్బారావ్. హేమాహేమీ రచయితలు పెద్దలు ఏటుకూరి బలరా

మ్మూర్తి, కంభంపాటి సత్యన్నారాయణ (సీనియర్) పోలవరపు శ్రీహరిరావు, శ్రీవిరించి, ఏ.బి.కె.ప్రసాద్ లాంటి యువ జర్నలిస్టులు అంతా మహీధరవారి వసారాలో (కరెంటు లేదు గానీ, వీళ్లే 'వెల్తురు'లు అన్నట్టు) సాహితీ సమాలో చన చేసేవారు. నేను రాసిన కథల్ని చదివే వాణ్ని. దానిమీద వాళ్లు 'చర్చ' జరి పేవారు (1960).

'మునగ చెట్టు' పట్టణ వాసపు శ్రామిక జీవుల వ్యథలకి అద్దం పట్టే కథ కానీ అందులో ఒక నవలకి చాలినంత కథ వుంది. 'వీరాజీ! దీన్ని నవలగా రాసి తీసు కురావయ్యా!' అన్నారు పెద్దలు. మునగచెట్టు కథ ఆవిధంగా చిన్న నవల అయింది. ఆ రోజుల్లోనే (1968) నా వ్రాత ప్రతి 'తొలిమలుపు'ను కూడా వారం వారం సీరియల్‌గా అక్కడే చదివాను. బహుశః తెలుగులో అదే తొలి 'శ్రవణ సీరియల్'. దాన్ని విశాలాంధ్రలో 'వార్త'గా వేసేవారు.

ఇక్కడొక మాట చెప్పాలి. కథల్లోని పాత్రలను మనం 'సంఘం'లో నుంచి ఎత్తుకుంటాం. తిరిగి సంఘానికి ఫినిష్డ్ ప్రొడక్ట్‌గా యిచ్చేస్తాం. సృష్టిపంబడ్డ పాత్రలు మన మాటవినవు. వాటి అస్థిత్వం వాటిది. అతీతంగా పోలేం.

1960లో ఆంధ్రపత్రిక కొంతమంది కథకులను ఎంచుకొని, కథలు రాయమని ప్రత్యేక కథల సంచికను తెచ్చింది. దానికోసం అదొక సత్కారంగా భావించి 'సుఖం' అన్న కథ రాశాను. క్యాపిటలిస్టు సుందరయ్య, భార్య, కూతుళ్లు, నౌకర్ వీళ్ల చుట్టూ తిరుగుతుంది కథ. 'బాపూ' గారు దానికి 'సెంటర్ స్ప్రెడ్' బొమ్మ వేశారు. పెద్దల సమక్షంలో విజయ సాహితీ సమావేశాల్లో దీన్ని అక్షరం అక్షరం పరిశీలించారు. 'దీన్ని నవల చెయ్యవోయ్' అన్నారు మహీధరవారు. ఆ ఆలోచన నా బుర్రలో తిరుగుతూనే వుంది. నేను 1961లో మద్రాసులో ఆంధ్ర పత్రికలో చేరి పోయాను. ఈ నవలని నేను మదరాసు లోకల్‌లో రాయాలనుకున్నాను. అట్లా అది నన్ను, 5, 6 సంవత్సరాలు ఆరాట పెడుతూనే వుంది. ఓసారి, ఎగ్మూర్ స్టేష న్‌కి కారులో నేరుగా ప్లాట్‌పామ్ మీదికెళ్లాను. అక్కడ నాకు 'సుఖం కోసం' అన్న నవలకి మలుపు దొరికింది. ఎం.ఎస్.రావు (శేషాచలం అండ్ కో) ప్రాచుర్యం గల రచయితలను పట్టుకొని ఎమెస్కో పాకెట్ బుక్స్‌గా నవలల్ని వెయ్యాలనుకొన్నాడు. నేను నా 'సుఖం కోసం' పూర్తి చేసి యిచ్చాను. ఈలోగా బెజవాడకి 'ఆంధ్రపత్రిక' వచ్చింది. దాంతో నేనూ మదరాసు నుంచి వచ్చేశాను. ఈ 'సుఖం కోసం'కి 'బాపు' వేసిన సింబాలిక్ కవర్ పేజీ బొమ్మకి ఆ తర్వాత ఫ్రాంక్‌ఫర్ట్ (జర్మనీ) బుక్‌ఫెయి ర్‌లో బహుమతి లభించింది. దాన్ని ఇటాలియన్ భాషలోకి అనువాదం చేసు కుంటాం అన్న ఆఫర్ వచ్చింది నాకు. విడివీడని చిక్కులూ అంతే! ఇలా వెయ్యం గానే అమ్మేసింది.

1960లో, అఖిల భారత రచయితల సభలు ముఖ్యమంత్రి దామోదరం సంజీ వయ్యగారు అధ్యక్షుడిగా పోతుకూచి వారు ఝూంమ్మని నిర్వహించారు. 'రావోయ్, కాలేజీ పిల్లకాయ్! నువ్వు 'తొలి మలుపు' వీరాజీగా కాదు, మలిమలుపు వీరాజీగా తయారవ్వాలి!' అంటూ అక్షరాలా ''ఎత్తుకుని''పోయారు మహీధర. అదో మరుపురాని అనుభూతి. నా నవలల వ్రాతప్రతులను కూడా అక్కడ పుస్త కాల ప్రదర్శనలో పెట్టారు.

### హిందీలోనూ చాలా కథలు రాణించాయి

అవన్నీ ఏనాటి ముచ్చట్లో! కానీ కాలగమనంలో కలిసిపోకుండా 1960 దాకా



## ఇష్టమైనవి

| | | |
|---|---|---|
| నటులు | : | శివాజీగణేశన్, దేవానంద్, అక్కినేని |
| నటీమణులు | : | నర్గీస్, రేఖా, శ్రీదేవి |
| సినీ దర్శకులు | : | కె.విశ్వనాథ్, బాపు |
| సంగీత దర్శకులు | : | శంకర్ జైకిషన్, ఎస్.రాజేశ్వరరావు |
| గాయకులు | : | కిశోర్‌కుమార్, ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం |
| సినీ మాటల మూటలు | : | పింగళి, జంధ్యాల, ముళ్లపూడి |
| పాటల ఊటలు | : | నీరజ్, సినారె |
| కవులు | : | ఆరుద్ర, కుందుర్తి |
| రచయితలు | : | శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి |
| ఆహారం | : | పక్కా శాఖహారం, నాన్‌స్మోకర్ గులాబీరేకులు తేనెలో ముంచుకొని తినడం, జున్ను, జీడిపప్పు యిష్టం. |
| మర్చిపోలేని ఘటన | : | మదరాసులో 1963లో - ప్రపథమ రోదసీ 1. మహిళ 'వాలెంతీనా తెరిస్కోవా'తో ఇంటర్వ్యూ 2. 1964లో ఎన్.టి.ఆర్.తో ముఖాముఖీ శీర్షిక కోసం 3 రోజుల పాటు ఇంటా-బయటా స్టూడియోలోచేసిన మరథాన్ ఇంటర్వ్యూ |

నా తమ్ముడు తర్వాతా 1967 నుండీ మా ఆవిడ మీనా (మీనాక్షి) నా కథలను కాపాడారు. ఓ లైబ్రేరియన్‌కి కూడా అంతవోపిక, మెళకువ వుండదేమో! (ఐ వోడెమ్). నా కుటుంబ సభ్యులందరి సహకారం నాకు అపారంగా వుండేది. వుంటున్నది.

ఏది ఏమయినా 'కథ' చెప్పడం ఒక లలిత కళ! భాషా సౌకుమార్యం, పద లాలిత్యం వుండాలి. 'ఏది చెప్పడం? ఎలా చెప్పడం?' అన్నవి రెండూ రెండు చక్రాలు. అందులో 'ఎలా చెప్పడం?' అన్న దానిమీద చాలా శ్రద్ధ తీసుకుం టాను.

కథా రుషి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి మాటలనే మనందరికీ శిరోధా ర్యంగా ఉటంకిస్తాను,

'రాయగా, రాయగా భాష స్వాధీనమవుతుంది. రాయగా రాయగా క్రాంతి దర్శిత/నిశిత/మవుతుంది. రాయగా రాయగా రచనా విధానం సుప రిష్కృతం అవుతుంది. రాయగా రాయగా తపస్సు సిద్ధించి మహర్షివి అవు తావు. మహర్షి కానివాడు కథలు రాయలేడు'

తెలుగు కథకి జై!

**-శ్రీనివాస్ గొల్లపూడి**



**నాకు నచ్చిన నా కథ**

# లక్ష

- వీరాజీ


గడియారాల ముళ్ళన్నీ ఇంచుమించు ఒంటిగంట దగ్గర కల్సుకుంటున్నప్పుడు....

అవతల ఎండ దంచేస్తోంది! చక్రపాణి పనిచేస్తోన్న ఆఫీసులోపల వేడి దంచేస్తోంది.

చక్రపాణి కడుపులో ఆకలి అరగంట సేపైంది - దంచేస్తోంది!

లంచ్! టైమ్మైంది ఆఫీసులకు.

ఇండ్ల దగ్గర్నుంచి చిన్నసైజు కారియర్ గిన్నెలూ, పొట్లాలూ, రంగు రంగుల ఫ్లాస్కులూ - తెచ్చుకున్నవాళ్ళు ఆవురావురంటూ అవి విప్పుకుని అర్జంటుగా తినేస్తున్నారు. మధ్య మధ్య అవతల ఎండ మండిపోతున్న సంగతి తమకు తెలుసునున్నట్లు ఉస్సురుస్సురంటున్నారు.



ఈ దృశ్యాన్ని చూస్తూ ఇరవై సంవత్సరాల సర్వీసు నలభై నాలుగేళ్ళ వయసు వున్న చక్రపాణి – రెండు మూడు నిమిషాలకన్నా ఎక్కువసేపు తన సీట్లో కూర్చో లేక పోయాడు.

''లాభం లేదు. ఏదో యింత లోపల పడేసుకురావా''లనుకుంటూ లేచాడు.


ఆఫీసు వేడిలో నుంచి బయటి ఎండలోకి నడిచాడు చక్రపాణి.

రోడ్డు కవతలివేపు ఎడంగా వుంది కాఫీకేఫే. ప్రక్కనే వుంది నాగయ్య అండ్ సన్ కిల్లీల దుకాణం.

ఎండలోపడి గబగబా అంగలువేసి అవతలివేపు ఫుట్‌పాత్ మీదకు గెంతాడు చక్రపాణి.

కాఫీ దుకాణం అధునాతనమైనది. అద్దాల తలుపులున్నది. దాని గుమ్మంలో వేడి వేడి పదార్థాల బోర్డున్నది.

''నాగయ్య అండ్ సన్ కిల్లీకొట్టు లోపల



తొట్టిలోపల వేణ్ణీళ్ళల్లో వున్న 'కూల్ డ్రింక్'లను వేడిగా వున్నాయంటూ అయిష్టంగానే తాగుతున్నారు. అవి త్రాగడానికి జేబుల్లో చాలినంత 'తడి' ఉన్నవాళ్ళు.

అలా ఎండ మండిపోతోంది!

అలాగే చక్రపాణి కడుపులో మండిపోతోంది!

ఇడ్లీ పావలా...

వేడి వేడి పదార్థాల బోర్డు మీద – నల్లని బోర్డుమీద తెల్లని అక్షరాలు – ఇడ్డన్‌లలాంటి అక్షరాలు – తార్రోడ్డ మీద ఎండలాగ మెరిసిపోతున్నాయి.

(కారప్పొడి కూడా వేయడు. సాంబార్‌కు అదనంగా పది పైసలిమ్మంటాడు అని దుఃఖ పడ్డాడు చక్రపాణి)

కాఫీ కూడా పావలా!

సాదా దోశె పావలా!

సింగిల్ గారె పదిహేను పైసలు.

మిగతావి మరి మనకక్కర్లేదు అనుకున్నాడు చక్రపాణి.

నాగయ్య చెమటలు కక్కుతూ పని చేస్తున్నాడు. సంతర్పణకు విస్తళ్ళు పరిచేసినట్లు తమలపాకులు పరిచేసి, కిల్లీలు కట్టేటందుకు – వాటిమీద రంగురంగుల సీసాలు చిలకరిస్తున్నాడు.

చౌదరిగారూ సిగరెట్లు – నాగయ్యగారూ పాన్, నాగయ్యగారు పాన్ – అంటూ కేకలు – తాపీగా వింటున్నాడు – జాగ్రత్తగా డబ్బులు లెక్కపెట్టి అందుకున్నాడు నాగయ్య.

''మిఠాయికిల్లీ పది పైసలు!''

''సిగరెట్లుకు మరో పదిహేను పైసలు!''

చక్రపాణి తొడుక్కున్న టెరిలీన్ అమెరికన్ షర్టుకు రెండు జేబులున్నాయి. వైట్ డ్రిల్ ప్యాంట్‌కి మూడు జేబులున్నాయి.

టెర్లీన్ షర్ట్ కాలర్ చెమటకు తడిసి, త్వరగా చివికి శిధిలమైపోకుండా తన చేతిరుమాలును తన మెడకీ, చొక్కామెడకీ మధ్య పెట్టుకున్నాడు చక్రపాణి.

అది తడిసి ముద్దయిపోయింది.

మొత్తం జేబుల్లోని చిల్లరంతా తడిమి చూసుకుని లెక్కపెట్టి – కూడి – మొత్తం యాభైయి మూడు పైసలని తేల్చుకున్నాడు చక్రపాణి.

మళ్ళీ కూడాడు. ఏభై మూడే వున్నాయి.

ఇడ్డెన్‌లు, కాఫీ, కిళ్ళీ, సిగరెట్లు రెండూ కలిపి కూడాడు.

కూడికలు ఎట్నించి చేసినా పైసాకూడా కలిసిరాక పోవడంతో నిరుత్సాహ పడిపోయి – తీసివేతలు ప్రారంభించాడు అకౌంటెంట్ చక్రపాణి!

సరిగ్గా అదే సమయంలో – అంతపని తొందరలోనూ వున్న నాగయ్య ఏం చక్రపాణి బాబూ! మీరింకా కాఫీ త్రాగి రాలేదల్లే వుందే?'' అంటూ పలకరించాడు.

''లేదయ్యా! కొంచెం కడుపులో మందంగా వుందీ'' అన్నాడు తీసివేతల్లో పడి కొట్టుకుంటూ వున్న చక్రపాణి.

''నాగయ్య అండ్ సన్ పాన్‌బీడా షాప్'' మీద తోరణాలై వ్రేలాడుతూ వున్న రంగురంగుల అర్ధనగ్నసినిమా తారల చిత్రాలన్నీ – అప్పడాల్లాగా ఎండి డొప్పులు తేరిపోతున్నాయి. చక్రపాణి వాటికేసి జాలిగా చూస్తూ తన లంచ్ జాబితాలో నుంచి ఇడ్డెన్‌లను నిర్దాక్షిణ్యంగా లాగి పారేశాడు.

''కాఫీ నీళ్ళు మాత్రం త్రాగాలి. తప్పదు'' లేకపోతే మధ్యాహ్నం 'భాసుడు' పిల్చే వేళకు తలకాయ నొప్పి లంకించుకుని అన్నీ స్పెల్లింగ్ మిస్టేకు లొచ్చేస్తాయి. 3+2=4 అవుతుంది.

సరే! సిగరెట్ ఎలాగా తప్పదు. దాన్ని హరిబ్రహ్మాదులు స్వయంగా వచ్చినా తొలగించలేరు. మరి మిఠాయి కిల్లీ!

నాగయ్య ఎంతో మర్యాదగా పలకరించాడు. కిల్లీ వేసుకోకపోతే బాధపడ్తాడు. కక్కుర్తి పడ్డాననుకుంటాడు – గనుక సిగరెట్టు కిల్లీ తీసుకుందామనే నిర్ణయించుకున్నాడు చక్రపాణి.

మెడ మీద తడిసి ముద్దయిపోయి వున్న చేతి రుమాలును తీసి – చెమట పిండి – మొహం తుడుచుకున్నాడు.

ఏభై మూడు పైసలతో ఆకలినీ, దాహాన్నీ, వ్యసనాన్నీ, అహంకారాన్నీ, స్టాటస్‌నీ తృప్తి పరచాలనుకున్న చక్రపాణి – ఒక నిర్ణయానికి వచ్చినట్లు – పెదాలు చుర్రుమని కాలిపోయేదాకా, సిగరెట్‌ను చివరికంటా పీల్చేసి, పారేసి కాఫీ క్లబ్‌లోకి దూరిపోయాడు.

మొత్తం ఐదు జేబుల్లోనూ వున్న చిల్లరపైసలను ఒక దగ్గరికి చేర్చాడు.

లాభం లేదు. ఇట్లా ఎంతకాలం? ఏదో ఒకటి చెయ్యాలి. ఉద్యోగం మానేసి ఆ 'ప్రావిడెంట్ ఫండ్' పుచ్చేసుకుని, చింతపండూ – ఎండు మిరప కాయల దుకాణమేనా పెట్టుకోవాలి'' అనుకున్నాడు.

నలుగురు ఎవరో – తెలిసిన కుర్రమొహాలు – ప్రక్క డిపార్ట్‌మెంట్‌లో గుమస్తా

లుగా చేరిన మొహాలు చక్రపాణిని చూసి గౌరవంగా - తింటున్న రవ్వదోసె ముక్కలను అలాగే నోట్లో నుంచి తీసేసి మరీ అభివాదాలు చేశారు. సర్వర్ రంగడు వినయంగా ''హాట్ ఇడ్లీ తెమ్మంటారా సార్'' అంటూ వచ్చాడు.

చక్రపాణి గొప్పగా నవ్వేశాడు. రంగడు కుర్రవాడు. పేదవాడు. స్టాటస్ లోనూ, జీవితంలోనూ బాగా తక్కువ వాడు అని ఆ నవ్వు భావం. జిహ్వాచాపల్యం రంగడిలాంటి కుర్రవాళ్ళకి వుండొచ్చును. అదుగో కొత్తగా బియ్యేలు ప్యాసై పెళ్ళాలు అనే భాగస్వాములు రాని కొత్త గుమస్తాలకు సహజం కావొచ్చును. కాని - జీవితాన్ని తరచి చూస్తున్న తనలాంటి అనుభవజ్ఞుడికి అది వల్లమాలిన పని. పరువు తక్కువ పనీ అన్నదా 'నవ్వు' తాత్పర్యం.

''వద్దు రంగయ్యా! ఇవాళ మా ఇంట్లో కాస్త పిండి వంటలు దండిగా చేశారు. గాని... నువ్వు పోయి స్ట్రాంగ్ కాఫీ, షుగర్ తక్కువగా వేసి పట్రా!'' అన్నాడు చక్రపాణి.

''అవల్ రైట్'' అంటూ వెళ్ళిపోయాడు రంగడు.

చక్రపాణి ఇందాక తనకు వచ్చిన చింతపండు దుకాణం అయిడియాకు తనే సిగ్గుపడ్డాడు. అకౌంటెంట్ స్టాటస్‌ను - ఇంకా పది పదిహేను సంవత్సరాలు అధమపక్షం వున్న స్టాటస్‌ను - వెధవది ఇడ్లెన్‌లు తినాలనే మమకారంతో వదులుకోడమా?

అటెండర్‌లు, టైపిస్టులు చిన్నగుమస్తాలు ఆఖరికి యజమాని 'రమాకాంత్' గారు కూడా తనకు 'గొప్ప రెస్పెక్టు' యిస్తారు.

చక్రపాణి తలెత్తి చూశాడు. ప్రొప్రయిటర్ 'బజ్జీలరావు' తన సీట్లో ఇరుకుగా కూర్చొని గారపళ్ళతో నవ్వేశాడు. చక్రపాణిని గౌరవ పురస్సరంగా పలకరించాడన్నమాట!

చక్రపాణి హుందాగా, ప్రత్యభివాద సూచకంగా నవ్వాడు. బజ్జీలరావుకు తనంటే ఇంత గౌరవం ఎందుకని? - బజ్జీలరావును మనసులో కూడా తను అట్లా అనడం బాగో లేదనుకున్నాడు. కానీ బజ్జీలరావు అసలు పేరు 'కుబేరన్' అన్నమాట యెవరికీ జ్ఞాపకం రాదు.

రంగడు కాఫీ తెచ్చాడు. ప్రక్కనే మరో గాజుగ్లాసుతో కొంచెం 'డికాక్షన్' కూడా పెట్టాడు. అదీ, చక్రపాణి - 'జేబులో యాభై మూడు పైసలు - కడుపులో పదహారు ఇడ్లెన్‌లకు ఆకలి, ఇంటి దగ్గర నలుగురు పిల్లలూ' గల అకౌంటెంట్ చక్రపాణిగారి స్టాటస్!

బజ్జీలరావు కివాళ పది లక్షల విలువైన ఆస్తి వుంది. అద్దాల తలుపులు గల హోటేళ్ళు మొత్తం మూడున్నాయి. కాని ఒకప్పుడు అదే 'చౌక్'లో కుబేరన్ - రోడ్డు వార కూర్చుని మిరపకాయ బజ్జీలమ్మేవాడుట. ఆ చౌక్‌లో ఆ సంగతి చూసిన వాళ్ళు చాలా కొంచెమంది గాని తెలియని వాళ్ళు యెవ్వరూ లేరు!

చిన్నపొయ్యి, ఒక మూకుడు. పాత సిల్వర్‌గిన్నెలో పిండి, సజ్జలో మిరపకాయలు - లుంగీమీద అల్లిక బనియన్ వేసుకున్న నల్లని పోత విగ్రహం లాంటి కుబేరన్ రోజుకి శేరు (తూకంలో) మిరపకాయల బజ్జీలతో ప్రారంభించి, నెల రోజుల్లో బస్తా మిరపకాయలను బజ్జీలుగా వేసి, అవలీలగా అమ్మేస్తూ వుండేటంత పెద్ద వ్యాపారి అయిపోయాడుట!

రానురాను కుబేరన్ మిరపకాయ బజ్జీయే అయ్యాడు ప్రజల నోళ్ళల్లో! అణాకు ఆరు ఇచ్చేవాడు మొదట. తర్వాత తర్వాత మూడు కంటె యెక్కువ రావు అన్నాడు. ఎవరు ఏదీ అడిగినా - కొసరు అడిగినా, మొహర్బానీగా అడిగినా, అరువుగా అడిగినా - ఎట్లా అడిగినా సరే - కుబేరన్ ''రావు స్వామీ! రావు'' అంటూ ఉండటం చేత కుబేరన్‌ను జనం 'బజ్జీలరావు' అనే వ్యవహరించడం ప్రారంభించారు.

అట్లా కుబేరన్ త్రివేండ్రం నుంచి వచ్చి ఈ నగరంలో బజ్జీలు రావుగా స్థిరపడి ఇవాళ కుబేరుడే అయిపోయినా...

చక్రపాణి కాఫీ త్రాగడం పూర్తయింది. ఆలోచన కూడా తెగిపోయింది.

''నేను రేపొద్దున్న చింతపండు, మిరపకాయలు దుకాణం పెడితే జనం ఏమంటారు? అన్న ప్రశ్న గుండెల్లో బెక్కెట్టి మరీ పొడుచుకొచ్చింది.

''చింతపండు చక్రపాణి'' అంటారు!? తన పిల్లల్ని ఇప్పుడు ''ధనం అండ్ కంపెనీ'' అకౌంటెంట్ గారి అబ్బాయిలు అంటున్నారు అప్పుడు?'....

చక్రపాణి ఇవతలికి వచ్చేశాడు.

నాగయ్య చేత కిల్లీ స్పెషల్‌గా కట్టించుకున్నాడు.

''ఎండ చెలరేగి మండిపోతున్నది! ధరలు మండిపోతున్నాయి'' అనుకున్నాడు చక్రపాణి.

చెమటలు కారిపోతున్నాయి. టెరిలిన్ షర్టు యాతన పెడుతున్నది. ఉస్సురస్సురంటూ చక్రపాణి పైన వ్రేలాడుతున్న షర్మిలాటాగోర్ పిన్‌అప్‌ను చూస్తున్నాడు కొంచెం దొంగతనంగా... (పెద్దాడు కదా స్టాటస్‌కి).

''మీరు ఇట్లా ఇకమీదట ఇంత మండుటెండలో యాతన పడిపోతూ ఆఫీసుకు రానక్కరలేదు సార్!'' అన్న మాటలకు చక్రపాణి ఉలిక్కిపడ్డాడు. తనని కాదేమోననుకున్నాడు.

కాని అవతలి వ్యక్తి అప్పారావు చక్రపాణి నుద్దేశించి ఆ మాటలు అన్నాడు.

''జరదా ఒకటి కట్టు నాగయ్య గారూ! ఇయ్యాళ ఈ గురూగారికీ ఓ రెండు రాయాలి! లక్ష్మిగళ్ గల్లుమంటూ రావాలి'' అన్నాడు అప్పారావు.

చక్రపాణిని అప్పారావు బాల్యస్నేహితుణ్ణి చూసినంత చనువుగా చూశాడు. ఎండలో - నిప్పులు చెలరేగుతున్న ఎండలో ఆకలిపొట్టలో వేడి కాఫీ నీళ్ళు పోసుకుని - నిలబడ్డ చక్రపాణిని చూసి - చల్లగా - గౌరవంగా నవ్వాడు అప్పారావు.

''నమస్కారం సార్! మీ కర్మేటి? ఇట్లా ఈ పాడు ముండా ఎండలో నడిచి - ఇంత కాస్‌టిలీ షర్టు నిట్లా తడుపుకుని రావడానికి! ఇంకొక్క నెల రోజులు ఓపిక పట్టండి సార్! మీరు హాయిగా ప్లిమత్‌కారులో వద్దురు గాని... రంయ్ రంయ్‌న రాడం, నాగయ్యగారు బ్రహ్మాండమైన కిల్లీ అయ్యగారికి కట్టి యివ్వడం - అది కారులోనుంచి మీరు అందుకోడం రంయ్‌న వెళ్లిపోడం...'' అప్పారావు జేబులో నుంచి పొడుగాటి ఓ చెక్కు పుస్తకం లాంటిది తీస్తూ - అలా అలా చెప్పుకుపోతున్నాడు.

స్పీడ్ లిమిట్‌లేని కారులాగ అలా వాగేస్తూన్న అప్పారావు మొహంలోకి చక్రపాణి తెల్లబోయి చూశాడు.

మొహం ఎక్కడో చూసినట్లే వుంది!....

కంఠం కూడా పరిచయంగానే వున్నట్లుంది.

అప్పారావును ఆ పేరు తెలియని చక్రపాణి పరిశీలనగా చూశాడు.

నాగయ్య కిల్లీ కట్టడం పూర్తిచేసి చక్రపాణికందిస్తూ ''ఈ అప్పారావు మాటలు నమ్మకండయ్యా! ఉత్తమాయగాడు. నేనిప్పటికి అయిదేళ్ళుగా కడుతున్నాను... ఒక్కసారేనా గల్ గల్లుమన్న లక్ష్మీ మనకి పలకలేదు'' అన్నాడు.

అర్థమైంది చక్రపాణికి.

అప్పారావు ఎవరో పూర్తిగా అర్థమైంది.

అప్పారావు చాలా ఖరీదైన బట్టలు తొడుక్కున్నాడు. తారీఖు, వారం కూడా చూపించే పెద్దసైజు గడియారం పెట్టుకున్నాడు. వ్రేళ్ళకు వరుసగా ఉంగరాలు పెట్టుకున్నాడు. ఆ వుంగరాల వ్రేళ్ళమధ్య అచ్చం చెక్కు పుస్తకం పట్టుకున్నట్లు లాటరీ టిక్కెట్ల పుస్తకం పట్టుకుని నిలబడ్డ అప్పారావు ఆ చౌక్‌లో బాకా పట్టుకుని మరీ - గల్లుగల్లున లక్ష్మి పలుకు తుందని నెలా ముప్ఫయ్‌రోజులూ, ఆబాల గోపాలాన్నీ, తన గ్రావ్యమై కంఠ ధ్వనితోను, కమ్మని కవిత్వంతోనూ ఆకర్షించి....

చక్రపాణి పెద్దమనిషిలా నవ్వేసి - తప్పించుకుందామని చూశాడు.

ఇటువంటి ప్రలోభాలు, భ్రమలు, తనలాంటి వాళ్ళ కుండవనీ - కేవలం అవి క్షుద్ర మానవులను మాత్రమే జలగల్లాగ పట్టి పీడిస్తాయని - ఒక్క చూపుతో అప్పారావుకి అర్థం చెయ్యాలని ప్రయత్నం చేశాడు.

అప్పారావులో నిరాశకు మారుగా ఆత్మవిశ్వాసం ఎక్కువైపోయింది.

ఓటు అడగ వచ్చిన 'ఎక్స్ ఎం.ఎల్.ఏ.' లా నవ్వుతూ ''అట్లా కొట్టిపారేయకండి సార్! మీలాంటివాళ్ళకు లక్ష్మీకటాక్షం రాసి పెట్టి వుంది సార్! లేకపోతే ఇంత మండుటెండలో ఇట్లా నేను మీ దగ్గరికే యెందుకు వస్తాను చెప్పండి! నాలోని అంతర్వాణీ, బెజవాడ కనకదుర్గమ్మ అంటా వుంది... ఈసారి నాచేతి మీద చెల్లిన టిక్కెట్‌కి లక్ష గల్ గల్ గల్లున (ఈ 'గల్లు' మన్న మాట అప్పారావులా ఎవ్వరేనా అంటే బస్తీమీద సవాల్... అచ్చం రూపాయల గలగల్లాగే అంటాడని జనవాక్యం)

## కథకు కూడా ఛందస్సు ఉంది



కథకి కూడా ఛందస్సు వుంటుంది. 'నడక' ముఖ్యం అంటాను నేను. కథలో మూడ్ సృష్టించాలి. అప్పుడే పాఠకుడు, పాత్రలు పరస్పరం లీనమై పోతారు. కొడూరి శ్రీరామ్మూర్తి, విహారి, కొండముది, వాకాటి లాంటి చాలా చాలా మంది విజ్ఞులకి, 'లక్ష' కథ చాలా నచ్చింది. దీన్ని నేషనల్ బుక్ ట్రస్టు వారు అన్ని భాషలలోకీ తర్జుమా చేశారు. అందుకే ఇది నాకు నచ్చిన నా కథగా చెబుతాను.

**- వీరాజీ**

***92900 99512***

రావాల్సిందే...''.

పెన్‌క్యాప్ తీసి, తిరగేసి గ్రుచ్చి ''చెప్పండి సార్! ఎవరి పేర్నైనా రాయొచ్చును. మీ వైఫ్, మీ సన్స్, డాటర్స్, బ్రదర్ యిన్‌లాస్. బేబీస్, ఎవరి పేర్నైనా రాయొచ్చును'' అంటున్నాడు అప్పారావు.

''మా కుక్కపిల్ల పే(్రా)యొచ్చా?'' అనుకున్నాడు లోపల లోపల చక్రపాణి. బయటికి అనలేదు. తనకి కుక్క పిల్లా లేదు; జేబులో రూపాయి బిళ్లాలేదు.

''పోనిద్దూ'' అందామనుకున్నాడు నిర్లిప్తంగా. కానీ బయటకు ''అది సరేనయ్యా! ఆ లక్ష రూపాయలు నాకే వస్తాయని ఇంత గట్టిగా అంటున్నావు కదా! దానివల్ల నీకేం లాభం? పది పైసలు కమీషనా?'' అంటూ నవ్వాడు.

''ఇన్‌సల్ట్!'' అన్నాడు అప్పారావు. అని నవ్వేసి ''సార్! లక్ష మీకు వస్తే పదివేలు ఈ అయ్యగారికి వస్తాయి'' అన్నాడు పెన్‌మొనతో గుండెల మీద సంకేతించుకొని వెంటనే ''ఇదుగో ఈ నంబర్, ఇంక మీదే! లక్కీ నెంబర్ వన్‌సార్! ప్రయిజు గ్యారంటీ!'' అని నాగయ్య కేసి తిరిగి ''అయ్యగారి పూర్తి పేరేంటి గురూ?'' అన్నాడు.

చక్రపాణి చివరి ప్రయత్నంగా అడ్డం పడ్డాడు. ''ఆ లక్కీ నెంబరేదో, నువ్వే కట్టుకోరాదూ!'' అని.

''నో... నో... సార్! నాకు లక్ష రూపాయల ఆశలేదు. పదివేలు చాలు సార్!'' భలేగా నవ్వేశాడు అప్పారావు.

అప్పారావును, చక్రపాణి ఇంక తప్పించుకోలేడన్న సంగతి నాగయ్య కూడా గ్రహించాడు.

''కట్టండి సార్! బజ్జీలరావులాగ మీరు కూడా దెబ్బకి ఓ పెద్దకంపెనీ ఏదైనా పెట్టేయొచ్చును'' అన్నాడు నాగయ్య.

చక్రపాణికి లోపల ఆశ చిన్నచిన్నగా మొలకెత్తి ''గారడీ వాడి మామిడి చెట్టులాగ'' ఎంతో పెరిగి మర్రి చెట్టయిపోయింది.

కానీ జేబులో రూపాయి లేదే!

అదే వుంటే నాలుగు ఇడ్లెన్లు – ఓహ్! ఇంచక్కా కొట్టేసి వుండేవాడు!

''ఇవాళ కాదులే – రేపు తీసుకోవచ్చును. నేను పైకం జేబులో వేసుకు రావడం మరిచిపోయానయ్యా!'' అంటూ వారించాడు.

అప్పారావు చిన్నబుచ్చుకున్నాడు.

చక్రపాణిలాంటి వాడలా దీనంగా మాట్లాడ్డం తనకి ఇష్టం లేదన్నదే అప్పారావు ముఖ కవళికల తెనుగు అర్థం.

''ఆలసించిన ఆశాభంగం... రేపు ఈ నంబర్, ఈ ఘడియ, ఈ ముహుర్తం, ఈ లక్, ఈ లక్ష... రమ్మంటే వొస్తాయా? నో యూజ్ సార్! రావు... ఇవాళే... ఇవాళే ఇదే సమయం గల్ ఘళ్ గల్లున లక్ష్మీ కటాక్షం... మీకు రావాలి... మీరు కారులో ఆఫీసుకు రావాలి...''

''అబ్బ! ఆపవోయ్ నీ గల్లు గల్లు – ఆయన పేర రాయి ఓ టిక్కెట్! రూపాయిదేం వుంది భాగ్యం! రేపు తీసుకుంటాను నేను.... ఇందు'' అంటూ ఉదారపురుషుడు నాగయ్య రూపాయి తీసి అందిస్తున్నాడు!

చక్రపాణికి తనకు తెలియకుండానే అంత ఎండలోనూ ఎందుకనో ఆ క్షణం చల్లగా వుంది!

''రూపాయికి లక్షా? నాకు మరీ అంత ఆశలేదయ్యా'' అన్నాడు నవ్వుతూ.

అప్పారావు నాగయ్య దగ్గిర రూపాయి అందుకుని చక్రపాణి పేరడిగి రాసి, మీ యిష్టదైవం ఎవరని కూడా అడక్కుండానే ''బజరంగ్‌బలీ'' అని రాసేసి – ఆ టిక్కెట్ పరన చింపేశాడు.

దాన్ని నాగయ్యకు అందించాడు. ''ఇందయ్యా! మీ చేత్తోనే అయ్యగారి కియ్యండి. లక్ లక్ష అయి వెతుక్కుంటూ వస్తుంది. ఇకమీదట ఇది చక్రపాణిగారి చేతిలో సుదర్శనం చక్రం అనుకో! లక్కీ ఛాన్స్.... గోల్డెన్ ఆపర్చునిటీ... ఓహో!''

చక్రపాణి నవ్వాడు.

కవిత
poem

## తోటమాలి



ఒక సూరీడు
ఒక చందమామ
పుడమిపై పొద్దు పొడుపు
మా నాయన
***
చీకటి గుహని
ఇల్లులా వెలిగించే దివిటీ
ఇంటికి పునాది
మా నాయన
***
నది మెడలో కిసుక్కుమనే తామర
తామర ఒళ్ళో బజ్జోయే వెన్నెల
పున్నమి భుజంపై జలపాత కండువ
రాత్రి పాడే జోలపాట
మా నాయన
***
చేతి సంచిలో తెల్లబియ్యం
బియ్యం కడుపులో దాగిన బలం
కష్టం చేతి సద్దన్నం
పైరుకు పాలిచ్చే పాడి ఆవు
మా నాయన
***
పరుగెత్తుతూ పాలు తాగుతున్న ప్రపంచంలో
నిలబడి నీళ్ళు తాగుతూ
కష్టం చేసి చెమట రాల్చుకుంటున్న
అమాయకుడు
మా నాయన–

–మహమూద్
సెల్: 93472 25279

''లక్ష రూపాయలిస్తున్నట్లే ఇస్తున్నావయ్యా!'' అన్నాడు.

''ఆహఁ! మీకు అదృష్టం వుండాలేకానీ ఇది లక్ష రూపాయలే సార్! మీకున్న లక్ష సమస్యలను పరిష్కరించే లక్ష రూపాయలు! మీకున్న లక్ష తియ్యని కోర్కెలను తీర్చే కల్పవృక్షం! అడవిలో వున్నా, చెరలో వున్నా వెతుక్కుంటే వచ్చే లక్ష్మీ! ఈ లక్షే సార్! ఆహ! నాగయ్యగారూ, ఇక మీ సంగతి. మీక్కూడా ఓటి రాయమన్నారేంటి!'' అంటూనే వున్నాడు అప్పారావు.

''పోవయ్యా! ఆయనకి లక్ష వస్తాయంటావు – మళ్ళీ నాకేమిస్తావు? నీ మొండి చెయ్యి!'' కసురుకున్నాడు నాగయ్య.

చక్రపాణి టిక్కెట్ అందుకుని, వెంటనే రూపాయి ఇవ్వలేకపోయానే అన్న చిన్నతనాన్ని కప్పి పుచ్చుకునే ప్రయత్నంగా ఓ నవ్వు నవ్వేసి, మండు టెండలో నుంచి ఆఫీసు వేడిలోకి బయలుదేరాడు.

లాటరీ టిక్కెట్ ప్యాంట్ జేబులో పెట్టుకున్నాడు.

...హుఁ....సుదర్శన చక్రంట!.... లక్ష రూపాయలే! ఈ కాయితం ముక్కకి? తనకే వస్తాయని లెక్కేమిటి?'' అనుకుంటూ సీట్లోకెళ్ళి కూర్చున్నాడు. ''అప్పారావు అసాధ్యుడు! ఎంతైనా, నాకన్నా వాడిపనే నయం. ఎంత దర్జాగా వున్నాడూ''.

## 2

చక్రపాణి పని చేసుకునే ప్రయత్నం చేస్తున్నాడు కాని మనసు ఉద్వేలంగా వుంది.

జేబులో వున్న లాటరీ టిక్కెట్ తీసి ఒకసారి చూద్దామనుకున్నాడు.

క్యాషియర్ తన బల్ల దగ్గర్నించే పొడుం పీలుస్తూ పలకరించాడు ''ఏం సార్! ఇవాళేదో చాలా సంతోషంగా కనపడుతున్నారు. ఏమిటి విశేషం?'' అన్నాడు.

చక్రపాణి ఆశ్చర్యపోయాడు. తను లాటరీ టిక్కెట్ కొన్నాడని వీళ్ళకెలా తెలిసింది. చెప్మా?''

''అబ్బే, ఏమీలేదే!'' అన్నాడు తడబడుతూ.

''అచ్'' మని తుమ్మి క్యాషియర్ మంగపతి ''ఇవాళ మా యావిడ మడి కట్టేసుకుంది సార్! నేనే ఇంతవుడక పెట్టుకుని, తిని లేచీ చక్కా వచ్చా! టిఫినూ చట్టుబండలూ ఏమీ లేదు. అవతల ఎండలాగ లోపల పొట్టలో దహించుకుపోతోందనుకోండి'' అంటూ బాధను వెళ్ళగ్రక్కాడు.

''అయ్యో, పాపం'' అన్నాడు సానుభూతిగా చక్రపాణి.

నా పనీ అలాగే వుంది. మా యావిడ ఇంట్లోకి రాకపోడం గట్రా లేదు.... కాని, నా ఒక్కడికీ ఇంత ఉప్మా కలియబెడితే అవుతుందీ?.... నలుగురు పిల్లలకీ నాలుగింతలు పెట్టాలీ అంటే భరించలేం కదా! అనుకున్నాడు లోపల లోపల కాని బయటికి ''వెధవది – ఫాన్ గాలికూడా అగ్గిలా కురుస్తున్నది. అబ్బబ్బా! పాడు ఎండ!'' అన్నాడు చక్రపాణి.

అంతలో జ్ఞాపకం వచ్చింది సుదర్శన చక్రం సంగతి.

''లక్ష రూపాయలు!'' వస్తే నిజంగా ఇస్తారా?... ఎందుకు ఇవ్వరూ? తన చిన్నతనంలో కిరసనాయలు సుబ్బయ్యకి 'డెర్బీ' వచ్చిందని చెప్పుకునే వారు. దాంతో 'బర్మా షెల్ కంపెనీ'' పెట్టేశాట్ట.... తనైతే మొదట ఏర్ కండిషన్డ్ రూమ్ కట్టించేసుకుంటాడు. కాని తనలాంటి వాళ్ళకా?.... లక్ష వస్తుందా? ప్చ్... వద్దు.... రాదు... రాదు...

'ఏం? తనకేం తక్కువా? పైగా తనేం కావాలని, గంజాయి భాయిలాగా పోయి ఈ టిక్కెట్లు కొనడం అలవాటు చేసుకున్న పక్షి కాదుగా... అదే పిలిచి మరీ

వచ్చింది. అప్పారావన్నట్లు 'గల్‌గల్' గల్లున లక్ష్మీ రాకూడదూ?.... ఏంవన్నారూ? సుమతీశతకంలో... ''సిరి తా వచ్చిన వచ్చును... సలలితముగ నారికేళ సలిలము భంగిన్'' అని కదా?.....

చక్రపాణికి లక్ష రూపాయలు వస్తే ఏం చేయాలి? అన్న సమస్యే రాలేదు. మొదట తను వుంటూన్న కారు కొంపను ఖాళీచేసి ఇంటిగల, రాంప్రసాదయ్య ఎదాన కొడతాడు. రెండున్నర గదుల గల పాత పురాణీకొంప.. దానిలో పంపులేదు. దొడ్డికి మరుగులేదు. సాలీళ్ళు, ఎలికలు, బొద్దెంకలు... అబ్బబ్బ! రోతా... రోతా...

వెంటనే ఓ ముప్ఫైవేలు పారేసి ఓ చిన్నపాటి ఇల్లుకొని

చక్రపాణికి ఏ మాదిరి ఇల్లు కొనాలో వెంటనే ఆలోచన పాలుపోలేదు!

''మొన్ననే రాజారావు యిరవై ఏళ్ళ నుంచి ఒంటి పూట తిని కూడబెట్టి ఓ ఇల్లు కట్టాడు. డొక్క మాడ్చుకుని కడితేనేం? మహా యిమ్ముగా కట్టాడు. అందుకే కాలు మీద కాలేసుక్కూచున్నాడు. అలాంటిదే కొనాలి'' అనుకున్నాడు చక్రపాణి.

కూడికలు చెక్‌చేస్తున్నాడు. కొసని ఎర్ర పెన్సిల్‌తో టిక్‌మార్కు పారేస్తున్నాడు.

పెద్దాడు లెక్కలు అవలీలగా చేస్తాడు. (తను చేయటంలా) పాపం? వాడికి ఇంజనీరింగు చెప్పించాలి... అలా కాకుండా ఈ గుమస్తాగిరీలో పారేస్తే... వాడున్నూ నాలాగే పది పది హేను ఇరవై ఏళ్ళకిగాని అకౌంటెంట్ కాలేడు – అని కొడుకు భవిష్యత్తు ఆలోచించాడు చక్రపాణి.

''పాపం! శారద! ఎదురుగుండా అనదుగాని – దానికి పెళ్ళినాటి పట్టు చీర తప్ప తను జన్మలో ఒక్క సిల్కుచీర కొన్నాడూ? పెళ్ళాం మీద జాలిపడ్డాడు. దరిమిలా నైలాన్‌లొచ్చాయి. టెర్లిన్‌లు, టెరీకాట్‌లు, యిలా ఎన్నో వచ్చాయి. మా పెద్దాడికి పద్దెనిమిది ఏళ్ళు వస్తున్నాసరే దానికీ వాడికీ ఎంత వార వుందీ? పద హారో పదిహేడో? ఇవ్వాళైనాసరే అది బోఫాన్ ఎంబ్రాయిడరీ చీరె కట్టుకుండె అంటే ఎడ్వర్‌టైజ్‌మెంట్‌లో వున్న అమ్మాయిల బొమ్మల్ని దిష్టిబొమ్మల్ని చేసేస్తుందంతే! దానికి, ఓ రెండు ఛీఛీ ! కక్కుర్తి! అంత డబ్బుకు రెండు కొంటామా! రెండు డజ న్లు – చీరెలు కొనిపారేస్తాను – అంతే!''నని తిరుగులేని నిర్ణయం తీసుకున్నాడు.

తననంతా టెరిలీన్ తొడుగుతానో అంటారు – అదేమో గొప్ప అయినట్లు – రాత్రి వుతికి దండాన పారేస్తే తెల్లారాక చెమటకంపు లేకుండా వేసుకు రావచ్చు. నేను అది అప్పుచేసి కొన్నాని యెవరికి తెల్సూ?–

చక్రపాణి తలయెత్తి నలుగుర్నీ చూశాడు. తన ఆలోచనలన్నీ వాళ్ళకి తెలిసి పోతున్నాయోమోనన్నట్లు చూశాడు. కాని దూరంగా వున్న కుర్ర క్లార్క్ తను చదువుతున్న ఫిలిమ్ ఫేర్ బల్ల క్రింద దాచేసుకున్నాడు.

నవ్వుకున్నాడు చక్రపాణి.

''గొప్పగా అన్నాడు అప్పారావు'' అనుకున్నాడు – ప్లిమత్ కారెందుకు గానీ, తను పెద్దాడు పుట్టాక ఆఫీసులో లోనుపెట్టి కొనుక్కున్న కీలు గుర్రం (సైకిల్) సర్వీస్ సయిపోయింది. మూలబడ్డది. దానికి బదులు తనో చిన్న విక్కీవో, లేకపోతే ఓ పెద్ద లాంబ్రెట్టావో కొనుకుంటే పోదూ!''

అంతలో ''అయ్యగారు పిలుస్తున్నారు సార్'' అంటూ ప్యూన్ గణేశ్ వచ్చాడు.

చక్రపాణి స్కూటర్‌మీద నుంచి నేరుగా వెళ్ళి మానేజింగ్ డైరెక్టరు గారి గదిలో పడ్డాడు.

ఆ గదిలోనించి చక్రపాణి బయటపడేసరికి టైము మూడుంబావయింది. యజమాని గదిలో వున్నంతసేపు చక్రపాణి యెక్కువగా అప్పచెప్పిన మాటలు మూడే మూడు – ఎస్సార్', 'అలాగేసార్' 'తప్పకుండా చేస్తాను సార్!'




చక్రపాణి ఓసారి జేబులో చెయ్యిపెట్టి నాగయ్య అప్పుయిచ్చిన రూపాయితో అప్పారావు చేత అంటగట్టించుకున్న లక్ష రూపాయల లాటరీ కాయితం చూసుకున్నాడు. బయటికి తీయలేదు.

''ఉహ్... ఇంకొంచెం రోజుల్లో ఈ 'యస్సార్' బిజినెస్ వదులుకోవచ్చు అనుకున్నాడు. ఇంటికి త్వరగావెళ్ళి శారదకీ సంగతి చెప్పాలను కున్నాడు. తన కొడుకు పార్థసారధి కూడా మానేజింగ్ డైరెక్టరు గారి కొడుకంతయ్యే సరికి అమెరికా వెళ్ళి వచ్చే అవకాశం తప్పకుండా వస్తుంది. డబ్బుంటే అలాంటివన్నీ వాటికవే వస్తాయి. ఎందుకురావు?

గోడ గడియారం కేసి చూశాడు.

వెధవ హంసనడక. మూడు ముప్ఫై ఐదు నిమిషాలే అయింది. ఇంతకీ ఈ అప్పారావిచ్చిన టిక్కెట్ బోగస్ టిక్కెట్టు కాదు కదా! అనుకున్నాడు చక్రపాణి.

క్యాషియర్ మళ్ళీ ముక్కుపొడుం పీల్చి 'ఆచ్' మని తుమ్మాడు.

రూపాయి నోట్లు వరుసగా కట్టలుకట్టలుగా పెట్టి టకటకా లెక్క పెట్టేస్తున్నాడు. అందులో నుంచి ఒక్కరూపాయి తీసికెళ్ళి వెంటనే నాగయ్యకిచ్చేస్తే ఎంత బావుంటుంది అనుకున్నాడు చక్రపాణి. తనకి ఏదేనా అరువు పుచ్చుకోడమన్నా – ప్రాణం మీది కొచ్చినప్పుడైనా సరే – గొప్ప పరువు తక్కువగా వుంటుంది.

కానీ ఏం చేస్తాం? అప్పారావలా మభ్యపెట్టేశాడు. ప్రలోభంలో పడేశాడు!

చక్రపాణి పని చేస్తున్నట్లు నటిస్తున్నాడే కానీ ఆలోచనలు, అనుమానాలు అతన్ని వదిలి పెట్టడం లేదు.

''లక్ష సమస్యలు తీర్చే లక్ష రూపాయలుట? తనకే వస్తాయా? అకౌంట్స్ చెక్‌చేసి, రైట్ అని టిక్కు మార్కు పెట్టవలసినచోట ఎర్రని క్వశ్చన్ మార్కు పెట్టాడు చక్రపాణి.

ఎందుకు రాకూడదూ? బజ్జీలరావులూ, డెర్బీ సుబ్బయ్యలూ, వీళ్ళంతా పుట్టుకతోనే బొడ్డున మాణిక్యాలుంచుకు పుట్టరా? ఏం?

అలాగే తనకీ – లక్ష్మీదేవికి వరించి రావచ్చును.

అప్పుడు తన కొడుకులు డాక్టర్, ఇంజనీరు లాంటి డబ్బులు చేసే ఉద్యోగాలు చెయ్యొచ్చు.

అప్పుడు తన్నుచూసి అంతా ఏమంటారు. అకౌంటెంట్... ఊహూఁ కాదు కాదు లక్షాధికారి చక్రపాణిగారు అంటారు... అంటారా? చక్రపాణి కనుమానం వచ్చింది... ఇంతవరకూ ఏ లక్షాధికారినీ ''లక్షాధికారి'' అని ఎవరూ రిఫర్ చెయ్యడం తను వినలేదు. కుబేరన్ని అలా ఎవరూ పిలవడం లేదుగా... బజ్జీల రావు అంటున్నారు.

''కిరసనాయలు సుబ్బయ్యని?'' చక్రపాణికి గుండె ఆగిపోయినట్లయింది!

హరి భగవాన్! తననేమంటారు రేప్పొద్దున్న? కొంపతీసి ''లాటరీ లక్ష చక్రపాణి?'' అనరుక దా! లా–ట–రీ–చక్రపాణి?–

చక్రపాణికి చెమటలు పోశాయి. తను డొక్క మాడ్చుకుని పిల్లల సరదాల్ని చంపేసి, పెళ్ళాం కోర్కెలనన్నీ కాలిక్రింద వేసి మట్టేసి, కష్టపడీ – ఎకౌంటెంట్ చక్రపాణీగారు అని సంపాదించుకున్న పాతికేళ్ళ ప్రిస్టేజి ఒక్క లాటరీ దెబ్బతో మంట కలిసిపోడమేనా? నో... నో...

తన ఇంటిపేరు ప్రఖ్యాతి గాంచినది. 'శ్రీముఖం' వారు. సాటివారిలో చక్రపాణి తన పేరుకన్నా గొప్పగా తన ఇంటిపేరు చెప్పుకుంటాడు. అది కాస్తా లాటరీ అని మారిపోడమా? వీల్లేదు – వీల్లేదు. గొణుక్కున్నాడు చక్రపాణి.

క్యాషియర్ మళ్ళీ పొడుం పీలుస్తున్నాడు. పొడుం పీలుస్తున్నవాడల్లా చక్రపాణి వేపు కళ్ళెత్తి చూశాడు.

చక్రపాణికి ఒళ్ళు మండిపోయింది. వెంటనే కోపంగా అయ్యా, క్యాషియర్ గారూ! ఇలా వస్తారూ? క్యాష్ చెక్ చేసేద్దాం'' అన్నాడు అకారణ కోపాన్ని దాచుకోకుండానే.

''చిత్తం!'' అంటూ రెండుసార్లు ''ఆచ్'' ''ఆచ్'' మని తుమ్మడం పూర్తిచేసి లేచాడు క్యాషియర్ మంగపతి.

చక్రపాణి విసుక్కుంటూ పని చేసుకుపోతున్నాడే గానీ మనసంతా వికలంగా వుంది. బజ్జీలరావు, కిరసనాయలు సుబ్బయ్య, సారా షాపు రత్తయ్యలాంటి పేర్లే జ్ఞాపకం వస్తున్నాయి. నాగయ్య మీద, అప్పారావు మీద వల్ల మాలినకోపం రాసాగింది. కొంపతీసి తనకి లాటరీ రాదుకదా! – కొంపతీసి రాదు కదా! అన్నమాటలే గుండెలు పిండసాగాయి.

''వెధవ లక్ష రూపాయలలో లెక్కా? పరువు ప్రతిష్ఠలు ముఖ్యం గానీ!'' అన్నాడు గట్టిగానే – బాధా, భయం అదుముకోలేక–

"మూడు వేల తొమ్మిది వందల అరవయి నాలుగు రూపాయల – ఇరవయి నాలుగు పైసలు – రిటర్న్‌నూ" అంటున్న మంగపతి ఒక్కసారి నోరు వెళ్ళబెట్టి "అదేమిటి మహాశయా?" అన్నాడు "లక్ష రూపాయల కన్నా పరువు ప్రతిష్ఠ లేముంటాయింకా?" అని కూడా సాగదీశాడు.

"వీ వూసు కాదులెండి. లెటజ్ ప్రొసీడ్!" అన్నాడు అచ్చం అకౌంటెంట్ హోదాలో చక్రపాణి.

## 3

ఐదయ్యేసరికి చక్రపాణి అలసిపోయాడు.

"ఇక దుకాణం కట్టేయాలను"కున్నాడు డ్రాయరు లోకి పుస్తకాలు సర్దేస్తూ.

సూర్యప్రకాశం దగ్గరికి వెళ్ళాలి. వాడు చేబదులుగా పాతిక రూపాయలు చూసి "అట్టేపెడ్తాను. క్లబ్ దగ్గరకు వచ్చితీసుకో!" అన్నాడు. మళ్ళీ యివ్వాళ వెళ్ళకపోతే వాడది రేపటికి "పేకాటలో పెట్టేశాను బ్రదర్" అంటాడు.

సూర్యప్రకాశం కలెక్టరాఫీసులో గుమస్తాయేగానీ, రోజూ క్లబ్‌కెళ్ళే పాటి స్తోమత వాడికెలా వున్నదో చక్రపాణి కర్థం కాదు.

"ఎవడెలాపోతే మనకేం? పైగా వాడు మన క్లాస్ మేట్ – ఆపద్బాంధవుడై అడపాతడపా అప్పు యిస్తున్న వాడున్నూ" అనుకున్నాడు, లేచి ఫాన్ కట్టేసి, లైట్ ఆర్పేసి బయట పడ్డానికి ఉద్యుక్తుడవుతూ–

చక్రపాణికి ప్యాంట్ జేబులో లాటరీ టిక్కెట్ బరువుగా వుందిప్పుడు–

ఆఫీసులో నుంచి రోడ్డుమీదకు – మండు సాయంకాలపు టెండలోకి అడుగు పెట్టాడు చక్రపాణి.

ఎదురుగా పండ్లకొట్టుదగ్గర కారొకటి ఆగింది. ఎండలో నల్లగా మెరిసి పోతుందో కారు. ఒకావిడ అందులోనించి కాస్టిలీగా దిగింది. ఆపిల్సు, చక్రకేళీలు బేరమాడకుండా కొనుక్కుని కారెక్కిపోయింది.

తనక్కూడా కారొకటి వుంటే శారద కూడా అలాగే వుంటుందేమో – అనిపించింది చక్రపాణికి.

ఆవిడెవరో?.... పిల్లలుండే వుంటారు. డజన్ ఆపిల్స్ ఎందుకూ లేకపోతే.

పండ్ల దుకాణం దగ్గిర ఎవరో అనుకుంటున్నారు – "బోడెమ్మగారి కోడలు" అనీ, ఆవిడ – మొగుడు సినిమా తీస్తున్నాట్ట – అనీ చెప్పుకుంటున్నారు.

చక్రపాణి ఆ జనం మీద విసుక్కున్నాడు లోపల లోపలే.

"ఆ కారు సుదతి" ఎవరో ఇప్పుడర్థమైంది తనకి.

టింబర్ మర్చంట్ నళినీకాంత్ భార్య. నళినీకాంత్ వాళ్ళమ్మ కర్రల అడితీ పెట్టించింది. ఆవిడ బోడెమ్మగారు. అందుకనే ఆ కర్రల అడితీని అందరూ బోడెమ్మ గారడితీ అనే వాళ్ళు. తర్వాత కొడుకు చేతికంది. లక్షల మీద వ్యాపారం చేస్తూ – దేశంలో పేరుపడ్డ టింబర్ మర్చంట్ అయ్యాడు కాని ఏం లాభం? ఛీ–ఛీ! ఉడకుమోతు జనం ఏఁవంటున్నారూ? "బోడెమ్మ గారి కొడుకూ, కోడలూ" అనేగా! – దిగులు వేసింది చక్రపాణికి!

చక్రపాణిని ఎవరో పలకరించారు – "నమస్కారం చక్రపాణి గారూ" అని, కానీ "లాటరీ చక్రపాణి గారూ!" అన్నట్లు వినపడ్డదా మాట చక్రపాణి చెవులకు, ఎక్కణ్నుంచో – ఎక్కణ్నుంచో కాదు – తన లోపల నించే!

లక్ష రూపాయలు రాకపోతేనే బాగుంటుంది అనిపించింది – వెంటనే ఆ లోపల్నించే.

బస్‌స్టాప్‌లో నుంచున్నాడు. ఎండ యింకా సూదులతో గ్రుచ్చినట్లు పొడుస్తున్నది. జేబులో చెయ్యిపెట్టాడు –తడుముకున్నాడు – క్లబ్ దగ్గరికి వెళ్ళడానికి టిక్కెట్ డబ్బులున్నాయి. వాటితో పాటే లాటరీ టిక్కెట్టున్నది. దాన్నీతీసి క్షుణ్ణంగా, మనసారా చదవాలి అనిపించింది. కాని సాయం కాలం రద్దీ! జనం బళ్లు – ఎండ – వడగాలి – దుమ్ము ధూళి – సిగ్గేసింది! పరువు తక్కువనిపించింది.



### అదృష్టం ఆమడ దూరంలోనే...

ఒక్క ఐడియా జీవితాన్ని మార్చివేస్తుందేమో కానీ, ఒక్క సినిమా సలోని జీవితాన్ని ఏమాత్రం మార్చలేకపోయింది. 'మర్యాదరామన్న' సినిమా సునీల్‌ని ఎక్కడికో తీసుకెళితే ఆ సినిమా హీరోయిన్ సలోనికి మాత్రం దురదృష్టాన్నే మిగిల్చిందంటున్నారు. 'మర్యాదరామన్న' తరువాత ఏ నిర్మాతా సలోనిని తమ సినిమాల్లో తీసుకోవడానికి ముందుకు రాలేదు. దీనికి కారణం సునీల్‌తో నటించడమే అన్న సంగతి అందరికీ తెలిసిందే! అవకాశాల కోసం సలోని ప్రయత్నించినా లాభం లేకపోయిందట! తాజాగా ఓ సినిమాలో అవకాశం వచ్చినట్టే వచ్చి చేజారిపోవడం చూస్తుంటే సలోనికి అదృష్టం ఆమడ దూరంలోనే ఉంటోందన్నది అర్థమవుతోంది.

లక్ష రూపాయలు! లక్ష కోర్కెలు తీర్చే లక్ష రూపాయలు! వచ్చే ఆ లక్కీ నెంబరెంతో? చూడాలనిపించింది.

బస్ జాడ లేదు.

చక్రపాణి పెద్దాడు అమెరికా వెళ్ళి రావడం గురించి ఆలోచిస్తున్నాడు

పెద్దాడు పెద్దాడై ఎస్.పార్థసారధి "అమెరికా రిటర్న్‌డ్" అయినాక ఇట్లా తనలాగే ఎండలో బస్‌కోసం నిలబడి సూర్య ప్రకాశం దగ్గరికి అప్పుకోసం వెల్తాడా?

వెళ్ళడు – అనుకున్నాడు

తెలిసిన వాళ్ళెవరో నమస్తే అన్నారు.

'తన పెద్దకొడుకు పార్థసారధిని చూసి రేపు ఇలా నమస్తే అనే వాళ్ళు కొన్ని వందలు –కాదు కొన్ని వేలుంటారు. ఎందుకుండరూ?

అయినా తనకే అనుమానం వచ్చింది.

పార్థసారధిని చూసి ఒకవేళ జనం – ఉడుక్కుంటే? అప్పుడుచూసి ఏమనుకుంటారు? – నీక్కూడా వాళ్ళబాబు లాగే లాటరీ ఏదైనా కొట్టుకొస్తే అమెరికా ఏంటి బ్రదర్ 'మూన్' మీదక్కూడా వెళ్ళి వస్తావు – అంటూ ఒకరితో ఒకరు అనుకుంటారేమో!

తప్పకుండా అనుకుంటారు – తనిప్పుడేగా అందుకు దాఖలాలు చూశాడు! (ఛీ! ఛీ! పాడు ఇండియా)

"నడమంత్రపు సిరి వస్తే, కళ్ళు కనిపిస్తయ్యా?" అని అంటున్నారెవరో – ఎవరినో – తన ప్రక్కనే వచ్చి నిలబడుతూ.

ఉలిక్కిపడ్డాడు చక్రపాణి.

ఓ కారు ఆ వ్యక్తిమీదుగా తోలుకుంటూ పోయిందో పడుచు. ఆ భయానికి గురియైన ఆ పెద్దమనిషి అట్లా తిడుతున్నాడు. ఆ కారులో వున్నదెవరో తెలుసుకోవాలనే కుతూహలం – కుతూహలం కూడా కాదు – అవసరం – కలిగింది చక్రపాణికి.

ఎందుకంటే ఈ అమ్మాయిలాగే మరో పదేళ్ళలో (తనకి లాటరీ గనకవస్తే తన కూతురునూ కారు డ్రయివ్ చెయ్యవచ్చునుగా.

తప్పకుండా కుమార్తె నళినిచేత తాను మెడిసన్ చదివిస్తాడు. ఇలా అనుకుంటూనే చక్రపాణి కారు క్రింద పడకుండా తప్పించుకుని వచ్చి తన ప్రక్కనే నుంచున్న ఆ వ్యక్తిని "ఎవరిదయ్యా ఆ కారూ?" అని అడిగాడు.

"ఎవరిదైతేనేంలెండి – కలికాలం! కన్నూమిన్నూ కానకుండా పోతోంది... గున్నయ్య అనీ ఓ బైరాగుండేవాడు నా చిన్నతనంలో – వాడికి వున్నట్లుండి లాటరీ తగిలింది! దాంతో చూస్తూ వుండగానే బైరాగిల్లా నవాబైపోయాడు. వాడి రెండో పెళ్లాం కొడుకు కూతురే ఈ సీతాకోక చిలుక. మెడిసిన్ చదువుతున్నానంటూ – వెధవకాన చెయ్యని సిన్ అంటూ లేదూ!" అని విసుక్కున్నాడాయన.

గున్నయ్య?.... చక్రపాణికి పేరు పరిచయంగా వుంది.

పరిచయంగా వుండటం ఏఁవిటీ? తన కంపెనీతో గున్నయ్యగారికి డీలింగ్స్ వున్నాయి. షష్టిపూర్తి చేసుకున్నవాడు – లక్షాధికారి. ఎరువుల కంపెనీ గలవాడు గున్నయ్య గారు.

చక్రపాణికి గొప్ప బాధ కలిగింది. ప్రక్కనున్న వృద్ధుని మీద వల్లమాలిన కోపం వచ్చింది. ఓర్వలేని తనం. వెధవ! అనుకున్నాడు.

"ఆ కారు మట్టేసినా పోయేది ఇలాంటి వాళ్ళను" అనుకున్నాడు.

''లాటరీ టిక్కెట్ల బండి ఒకటి అటుగా పోతోంది ... వృద్ధుడన్నాడు ''పాడు ముండాకాలం... ఈ లాటరీల మీద దోచేస్తున్నారండీ'' అని.

చక్రపాణికి లక్ష రూపాయలు తనకు వచ్చింతర్వాత - తనూ శారదా, పిల్లలూ ఎలా మారిపోతారో దృశ్యాలుగా కనపడ్డం మానేసింది.

జనం అనగా సమాజం తననూ, తన పిల్లల్నీ ''లాటరీ చక్రపాణి కుటుంబం'' అంటూ కాకిలా పాడుస్తూ వెక్కిరించడమే కనపడ్డాది.

''శ్రీముఖంవారి సంతతకి ఎంత దుర్గతి'' అని ఈ వృద్ధుడిలాంటి వాడే అప్పుడు మరికొన్ని సంవత్సరాలలో అంటాడు అనిపించింది.

జేబులో చెయ్యిపెట్టాడు. ''లక్ష కోర్కెలు తీర్చే గల్‌గల్‌గల్లున వచ్చే లక్ష్మీ...'' అప్పారావు మాటలు చెవులు గింగుర్లెత్తిస్తున్నాయి. కాని లక్ష కోర్కెలకు బదులు లక్ష సమస్యలు తెచ్చే... అనిపిస్తోంది చక్రపాణికి.

చిరాకెత్తిపోయింది. మనసు మార్చుకునేందుకుగాను సిగ్గువిడచి బామ్మది రాసిన ఇన్‌లాండ్ కవర్ ఉత్తరంలో చెమటకి తడిసిపోకుండా దాచుకున్న లాటరీ టిక్కెట్టును ఉత్తరం మడతలోనే వుంచి బయటికి తీశాడు.

అటూ ఇటూ చూశాడు. బస్సు యింకా కనుచూపు మేరలో ఎక్కడా లేదు. ఉత్తరం మడతలోనే వుంచి లాటరీ టిక్కెట్‌ను రహస్యంగా చదువు కుంటున్నాడు.

లక్ష రూపాయల ప్రయిజు మాత్రమేనా? సెకండ్ ప్రయిజులు రెండు - 'ముప్ఫయి వేలు', థర్డు ప్రయిజులు మూడు 'పదివేలు' యిలా వున్నాయి దాన్నిండా పెసర గింజలంతేసి అక్షరాలు... నెంబర్ 3245670.



చక్రపాణి వెధవలక్ష ఎవడి క్కావాలి? ఆ పదివేలు మాత్రం వస్తే చాలదూ? ''అప్పూ సప్పూ తీర్చుకుని కాస్త కుదటపడ్డానికి సరిపోతుందీ'' అనుకున్నాడు. అద్వైతే పబ్లిసిటీ బారినుంచి తప్పుకోవచ్చు - కాని అప్పా రావు గాని, నాగయ్య గాని అట్లా ఒక్కసారైనా అనలేదు.

లక్షా! లక్షా అంటూ ప్రాణం తీశారు. రూపాయి అప్పుకూడా పెట్టారు.

లక్ష వస్తే బాగానే వుంటుంది గానీ పరువు మంట గలుస్తుంది. అవమానం కూడై పోతుంది బ్రతుకంతా.

టిక్కెట్ నెంబరు ''న్యూమరాలజీ ప్రకారం'' కూడాడు. తొమ్మిది అయింది.

గుండె గుభేలుమంది. తన డెస్టినీ నెంబర్‌కీ, ఈ మార్స్ నెంబరు తొమ్మిదికి ససేమిరా పడదు. దీనివల్ల అవమానం, పరాభవం - కీడు తప్పవు.

చక్రపాణికి ఒక్కసారిగా లక్ష రూపాయలు వచ్చేస్తాయేమోనని భయం వేసింది.

అంతలో ఒక బస్సు వచ్చింది.

తనది కాదది.

సూర్యప్రకాశం ఆరులోగా రమ్మన్నాడు. చక్రపాణి టైము చూశాడు. ఐదూ ఏభై అయింది.

''ఆరు దాటాక అయితే వాడు పేకాటలో నుంచి చచ్చి గీపెట్టినా లేవడు'' అను కున్నాడు, సూర్యప్రకాశం సంగతి బాగా తెల్సు కనుక-

పేకాట? రేపు లాటరీలో డబ్బు వస్తే తనూ ఆడతాడు! తనకి రాని పేకాట లేదు. బ్రిడ్జి అయితే తినేస్తాడంతే గాని - నిగ్రహంతో వుంటున్నాడు. (డబ్బు లేదుగా)

చక్రపాణికి '9' నెంబర్ చెడ్డ ప్రభావం అప్పుడే తెలిసిపోతున్నది.

తన సంగతికేం - పిల్లలు ఇట్లాంటి వ్యవసనాల్లో పడితే? తన గతేం కాను?

లాటరీ టిక్కెట్ తీసి అవతల పారేద్దామా? అనిపించింది.

మనసొప్పలేదు.

లక్ష వద్దు పదివేలు చాలు అని గొణుక్కున్నాడు.

అరె! బస్సు వచ్చింది. జనం తోసుకుంటున్నారు.

చక్రపాణి ఎక్కేశాడు. క్లబ్‌కి ఇవతలి స్టాపుకి మాత్రం టిక్కెట్ కొన్నాడు.

''లాటరీ చక్రపాణి గారూ కక్కుర్తిపడితే యెట్లా?'' అన్నట్లు చూశాడు కండక్టర్. పది గజాలు ఎడంలో మరో స్టాపుంటే ఒక్కసారిగా ఐదు పైసలు యెక్కువ ఇమ్మం టారు అని లోపల లోపల తిట్టుకున్నాడు చక్రపాణి.

బస్సంతా కిటకిటలాడుతూ, చెమటకంపు కొడుతూ నరకంగా వుంది.

ఇంతకీ ప్రయిజు వచ్చి చస్తే చూద్దాంలే అనుకుంటున్నాడు నలిగిపోతూ నిల బడ్డ చక్రపాణి.

బస్‌లో జనాన్ని దూది కూరినట్లు కూరేస్తున్నాడు కండక్టర్.

చక్రపాణి సూర్యప్రకాశం దగ్గరకి వెళ్ళి తీరాలి తప్పదు.

''రేపు నాగయ్యకి రూపాయి ఇవ్వాలి కూడాను'' అనుకున్నాడు.

లక్ష రాకపోతే బాగుండును. పదివేల రూపాయలు వస్తే చాలదూ? అనుకుం టున్నాడు మళ్ళీ మళ్ళీ-

పోనీ! ఈ టిక్కెట్ పేకాట సూర్యప్రకాశానికిచ్చేస్తే? వాడూ సంతోషిస్తాడు. కావాలంటే దీనిపై గల ఎలాంటిహక్కులూ నాకు లేవని యిందు మూలంగా ప్రకా శానికి ఇచ్చేస్తున్నాని లిఖిత పూర్వకంగా యిచ్చేస్తాను - రూపాయేకదా పోతుంది? పోనీ - దాంతో లక్ష సమస్యలున్నూ పోతాయ్! పరువు దక్కుతుంది. ప్రతిష్ఠ మిగు లుతుంది.

అంతరద్దీలోనూ రెండు తలకాయల మధ్య గల ఖాళీలోంచి ఆడాళ్ళ సీట్ల దగ్గర నిలబడ్డ నైలాన్ సుందరి చక్రపాణి కంటబడ్డది!

ఎర్రని లిప్‌స్టిక్ పెదలు! నల్లని సూర్మాకళ్ళు - రిబ్బన్ ముక్కలేని చక్కని జడ. ఎత్తయిన రొమ్ముల మీద నైలాన్ వోణీ వేసుకుని మాలాసిన్హా వాల్ పోస్టర్‌లా నిల బడ్డదా వొయ్యారి. అంత రద్దీలోనూ (మనసూరి పోయింది చక్రపాణికి).

అంతే - బస్టాప్ వచ్చినా కండక్టరు కేకలు వేసే దాకా చక్రపాణికి ఈ ప్రపంచ ధ్యాసే లేదు. (లక్ష ధ్యాస కూడా)

ఒకడి మోచెయ్యి, మరొకడి మోకాలు, తాతగారి కర్ర, మాస్టారి గొడుగు, స్కూల్ బాయ్ టిఫిన్ కారియరూ, చివరికి ఆ మాలాసిన్హా చున్నీ కొంగూ - యిన్ని తగిలితే గానీ బస్సు దిగలేక పోయాడు చక్రపాణి.

దీపాలు వెలిగిపోతున్నాయి. ఆరుదాటి పోయింది. పరిగెత్తినట్లు క్లబ్ చేరుకు న్నాడు.

ప్రకాశం వున్నాడు. ''దేవుడిలా కనబడ్డావురా భాయ్!'' అన్నాడు చక్రపాణి లాట్రీ వచ్చినట్లు మొహం పెట్టి.

లోపల పేక కలుపుతున్నారేమో, హడావిడిగా వచ్చాడు ప్రకాశం.

''సారీ పాణీ! పాతిక లేవు. ట్వంటీ మాత్రం తేగలిగా, అవతల మాగురుళ్ళు గోలెడుతారు. నే వస్తా బై బై'' రెండు పది కాగితాలు. చక్రపాణి చెమ్మగా వున్న చేతిలో పెట్టి ఎవరో తరుముతున్నట్లు వెళ్ళిపోయాడు ప్రకాశం.

చక్రపాణికి ఇరవై రూపాయలూ పందొమ్మిది లాగే కనబడ్డాయి. రూపాయి నాగయ్య కివ్వాలిగా!

## ప్రేమా, దోమా ఒట్టి ట్రాష్...

ఈ మాటలు ఏ సీనియర్ హీరోయిన్ నోటి నుంచో వచ్చి ఉంటే, పాపం స్వానుభవం అంటూ సరిపెట్టుకోవచ్చు. పై మాటలు అన్నది తమన్నా. ప్రేమ సన్నివేశాల్లో అత్యంత సహజంగా నటించే తమన్నాకు ప్రేమ అంటే అస్సలు పడదట! ఈ మాటలు ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది.

''ప్రేమ మీద నాకు నమ్మకం లేదు. నేను ఫక్తు సంప్రదాయ కుటుంబం నుంచి వచ్చాను. పెద్దలు కుదిర్చిన సంబంధమే చేసుకుంటాను. అది కూడా సినిమాల్లో ఉన్నప్పుడు కాదు. సినిమాలకు ఫుల్‌స్టాప్ పెట్టేయాలి అని నిర్ణయించుకున్నప్పుడు పెళ్ళికొడుకును చూడమని మా పేరెంట్స్‌కి చెబుతాను. ఒకసారి పెళ్ళి అయిన తరువాత ఇక సినిమాల వంక చూడను. నా భర్తకే అంకితమైపోతాను'' అంటూ చెప్పుకొచ్చింది. పరిశ్రమలో మీ పొజిషన్ ఎలా ఉంది? అన్న ప్రశ్నకు పొంతన లేని సమాధానం ఇచ్చిన తమన్నాను చూసి పలువురు విస్తుపోయారట! ఏమైతేనేం తమన్నా మనసు తెలిసింది అని వారు అంటున్నారు.

అరె! అన్నట్లు లాటరీ టిక్కెట్! లక్ష రూపాయలనే సుదర్శన చక్రం – వీడికి యిద్దామనుకున్నాంగా – అంటూ జేబులో చెయ్యిపెట్టుకుని – ''ప్రకాశం!'' అని కేకేశాడు – 'మాట' అన్నాడు.

ప్రకాశం ఏడుపుమొహం పెట్టి ఇంకా ఎందుకరా? అన్నట్లు వెనక్కి చూశాడు.

చక్రపాణికి మళ్లీ మనసు పీకింది. లక్ష రూపాయలు! కానా? దమ్మిడా? వదిలేడమే?–

''ఏం లేదురా! వస్తా – గుడ్ నైట్!'' అంటూ వెనుదిరిగాడు.

జేబులో చెయ్యి బయటికితీశాడు. చేతి రుమాలొక్కటే బయటికి వచ్చింది. బావమరిది రాసిన 'లెటర్' లేదు! (దాని మడతలోనేగా లాటరీ టిక్కెట్ వున్నదీ).

ఇవతల ప్రక్క జేబు వెతికాడు.

''ఊహు? ఇన్‌లాండ్ లెటరూ లేదూ, అందులోని టిక్కెట్టూ లేదు!'' చక్రపాణి గుండెలు జారిపోయాయి.

''అయ్యో! నా టిక్కెట్'' అంటూ మిగిలిన జేబులన్నీ దీప స్తంభం క్రింద నిలబడి వెతికాడు.

ఛీ! ఛీ! వెధవ బ్రతుకు! ముష్టి బ్రతుకు! దర్రిదగొట్టు జన్మ! అదెవతో గాజుబొమ్మలా వుందని – దాన్ని చూసి చొంగలు కారిపోతూ – నా లక్షరూపాయల టిక్కెట్ పోగొట్టుకున్నాను – ఛీ! ఛీ! నేనీ జన్మకి బాగుపడను. నాకు లక్ష రూపాయల ఛాన్స్ కూడానా? ''ఇంచుమించు కన్నీళ్ళు లేవుగాని సముద్రమంత దుఃఖం వచ్చింది చక్రపాణికి.

ఇన్‌లాండ్ కవర్‌లా కనపడ్డ ప్రతి కాయితాన్ని వెలుగు నీడల చారికల్లో వెతకసాగాడు.

అప్రయత్నంగానే రోడ్డుమీద ప్రతి కాయితాన్నీ కళ్ళు పొడుచుకుంటూ చూస్తూ తిరిగి ఆఫీసు దగ్గర బస్‌స్టాప్‌కే వచ్చాడు.

రూపాయిపోతే యింత విచారం వుండకపోను! వెతుక్కుంటూ వచ్చిన లక్ష్మి! లక్ష రూపాయల టిక్కెట్! పోయింది – పోయింది – ప్ఛ్‌ప్ఛ్–

చక్రపాణి జీవితంలో మునుపెన్నడూ ఆఖరికి – మూడేళ్ల ప్రమోషన్ ఆగిపోయినప్పుడు కూడా లేనంత నిరాశ పడ్డాడు.

''ఎవరికో అదృష్టవంతుడికి దొరికుంటుంది. దేనికైనా ప్రాప్తం వుండాలి!''

''లేకపోతే నా మొహానికి ప్రయిజేమిటీ?'' ఒక వేళ బస్సులో పడ్డదేమో! ఆ బస్సు నెంబరెంత? కండక్టర్నడిగితే – ఏమని అడుగుతాం? (సిగ్గుగా వుండదూ) పోనీ నా యిన్‌లాండ్ లెటరు పోయింది – చాలా ఇంపార్టెంట్ లెటరు అని అడుగుదాం – అనుకున్నాడు.

కాని చక్రపాణికి ఆ బస్‌జాడ కనబడలేదు. దర్రిదుడు తలగడిగితే వడగళ్ళ వానా! అని ఆ బస్ కూడా ఎక్కడో పోయుంటుంది అని బాధపడ్డాడు.

పోనీ పీడా పోయింది అనుకుంటాడేగానీ బస్‌స్టాప్ వదిలిపోడు! ఎనిమిది గంటలయింది. ఓల్డ్ మోడల్ గడియారం చెయ్యి చెవిదగ్గర పెట్టుకున్నాడు. టిక్ టిక్ లేదు. అదీ ఆగిపోయింది. ఎనిమిది దగ్గర!

బస్సులొచ్చాయి. వెళ్ళాయి. తన ఆ బస్సు రాలేదు.

టైమెంతయిందో? తొమ్మిదయి పోయుంటుంది! గడియారం కూడా ఇప్పుడే ఆగిపోవాలీ?

చక్రపాణి ఒళ్ళు మండిపోయేటంత కోపంగా వుంది. ఛీ! – విరక్తి కూడా వేస్తోంది!

అప్పారావు మీద, నాగయ్య మీద, బస్సు మీద, ఆ మాలాసిన్హా లాంటి సుదితీమణి మీద – తన మీద – ఈ పాడు ప్రపంచం మీద – కోపంగా వుంది. దుఃఖం కూడా వస్తోంది.

అక్కౌంట్స్‌లో 20 ఏళ్ళు సర్వీసుంది గనుక జ్ఞాపకం వుంది టిక్కెట్ నెంబర్! (ఎందుకైనా మంచిదని – ఆశ చెడ్డదిగా) 3245670 అని మననం చేసుకుంటూ అకౌంటెంట్ చక్రపాణి – బాధగా, దుఃఖంగా, కోపంగా, జాలిగా, కాళ్లీడ్చుకుంటూ ఇంటిమొహం పట్టాడు!

❑

*(1967 జ్యోతి మాసపత్రిక దీపావళి సంచిక)*

## మనమీదేనక్రోయ్!

సరసి

